# నమస్తే తెలంగాణ

# యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, సోమవారం 3 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI




తెలంగాణభవన్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్న తుర్కపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు

# ఘనంగా ఆవిర్భావ వేడుకలు



**జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు**

- జాతీయ జెండాలకు వందనం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో స్వీట్ల పంపిణీ, సేవా కార్యక్రమాలు
- జిల్లా కేంద్రంలో జెండా ఎగురవేసిన కలెక్టర్

*తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యమకారులు, ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని జాతీయ జెండాలకు వందనం చేశారు. అమరవీరులను స్మరిస్తూ నివాళులర్పించారు. జై తెలంగాణ.. జోహార్ అమరవీరులు అంటూ నినాదాలు చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు కె. జెండగే జాతీయ జెండా ఎగుర వేసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని పదేండ్లు నిండిన సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేడుకలు చేపట్టారు. పార్టీతోపాటు జాతీయ జెండాలు ఎగురవేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.*



యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ హనుమంతు జెండగే

## అభివృద్ధిలో భాగస్వాములమవుదాం

- పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ
- అంకితభావంతో పని చేసి అమరుల త్యాగాలకు గుర్తింపునిద్దాం
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 2 : అభివృద్ధి పథంలో మన మందరం భాగస్వామ్యులవుదామని, తెలంగాణ పోరాటాల పురిటిగడ్డ అని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ చేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం సాగిన మహోద్యమంలో పాలుపంచుకున్న వారందరికీ అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాలు, కార్మిక, కర్షక, విద్యార్థులకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తి చేసుకొని 11వ వసంతంలోకి అడుగుపెట్టిందని, ఈ పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే తెలంగాణ పోరాటాల పురిటి గడ్డ అని, మన తెలంగాణ మహాకవి దాశరథి కీర్తించినట్లుగా నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని అన్నారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతున్నదని గుర్తు చేశారు. ఈ క్రమంలో మనమందరం అంకితభావంతో పని చేసి అమరుల త్యాగాలకు గుర్తింపు నిద్దామని చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు అత్యధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకొని పోలింగ్ శాతంలో రాష్ట్రంలోనే భువనగిరిని మొదటి స్థానంలో నిలిపారని, ఈ సందర్భంగా ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందికి, పోలీసు యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. జిల్లాలో పరిపాలనను ప్రజలకు చేరువగా తీసుకెళ్లి అభివృద్ధి ఫలాలను ప్రజలందరికీ అందేటట్లు చేయడానికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. శాంతి భద్రతలు కాపాడటంలో కృషి చేస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. అంతకు ముందు భువవగిరి పట్టణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ధనావత్ బిక్కూనాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్, రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీలు సుబ్బూరు బీరు మల్లయ్య, కుడుదుల నగేశ్, ఎంపీపీలు నరాల నిర్మల, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



భువనగిరిలో ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం



జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి



ఆలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో పోలీసుల కవాతు

# రేపే కౌంటింగ్

## భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో ఈవీఎంలు
- ఉదయం 8గంటలకు కౌంటింగ్ షురూ
- తొలి రౌండ్ ఫలితం 8.40 గంటలకు
- పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతి
- వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్
- విధుల్లో 800మంది ఎన్నికల సిబ్బంది
- కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్



భువనగిరిలోని ఆరోరా ఇంజినీరింగ్ కళాశాల

*లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల భవితవ్యం మరో 24 గంటల్లో తేలనుంది. మంగళవారం ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. భువనగిరి పట్టణంలోని అరోరా కాలేజీ వద్ద కౌంటింగ్ జరుగనుంది. ఇందుకోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలు లేకుండా సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. లెక్కింపునకు నియోజకవర్గాల వారీగా టేబుళ్లు, రౌండ్లు ఎన్ని అనేది నిర్ణయించారు. ఇక లెక్కింపు కేంద్రం వద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా మూడంచెల భద్రతతోపాటు 144సెక్షన్ అమలు చేయనున్నారు. ఈసీ అనుమతితో కూడిన పాస్‌లు ఉంటేనే లోపలికి వెళ్లనిస్తారు.*

– యాదాద్రి భువనగిరి, జూన్ 2 (నమస్తే తెలంగాణ)

### తొలి రౌండ్ ఫలితం ఉదయం 8.40గంటలకు..

భువనగిరి లోక్‌సభ స్థానానికి 39మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గత నెల 13న పోలింగ్ కొనసాగింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. ఉదయం 5.30గంటలకే కౌంటింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకోనున్నారు. ఎవరైనా పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతిస్తారు. ప్రతి ఒక్క టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉంటారు. మొదట పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను ఓపెన్ చేస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఈవీఎం ఓట్లను ఒకేసారి లెక్కిస్తారు. 39మంది అభ్యర్థులు ఉండటంతో ఫలితాలు ఆలస్యంగా విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొదటి రౌండ్ ఫలితం ఉదయం 8.40గంటలకు విడుదలవుతుంది. చివరి రౌండ్ ఫలితం మధ్యాహ్నం 3.30 గంటలకు బయటకు వచ్చే అవకాశం ఉంది. మధ్యాహ్నం వరకు ట్రెండ్ తేలిపోనుంది.

### విధుల్లో 800 సిబ్బంది

ఓట్ల లెక్కింపులో సుమారు 800 మంది స్టాఫ్ విధులు నిర్వర్తించననున్నారు. కౌంటింగ్‌కు 400 మంది, ఇతర ఏర్పాట్లకు మరో 400 మంది పని చేయనున్నారు. ఏడుగురు ఏఆర్‌ఓలు ఉంటారు. ఈవీఎంలకు సంబంధించి ఒక్కో టేబుల్ వద్ద ముగ్గురు సిబ్బంది పనిచేస్తారు. ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం ఫలితాలు నమోదు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్ సంబంధించి ప్రత్యేక హాల్ ఏర్పాటు చేశారు. హోమ్ ఓటింగ్, విధుల్లో ఉన్న సిబ్బందికి సంబంధించిన ఓట్ల కౌంటింగ్ 14 టేబుళ్లలో జరుగుతుంది. ఒక టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, తాసీల్దార్ స్థాయి ఏఆర్‌ఓ ఉంటారు. ఇక భద్రతకు పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద సీఆర్‌పీఎఫ్ భద్రతా సిబ్బందితోపాటు రాష్ట్ర సాయుధ సిబ్బంది, ఏఆర్ ఫోర్స్, సివిల్ ఫోర్స్ ఉంది. అలాగే స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ కూడా ఉండనుంది.

### టేబుళ్లు.. రౌండ్లు ఇలా..

భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏడు కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రత్యేక హాల్ ఉంటుంది. ఆయా సెగ్మెంట్లలో పోలింగ్ బూత్‌లను అనుసరించి టేబుళ్లు, రౌండ్లను నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి అత్యధికంగా 20 టేబుళ్లు, 18 రౌండ్లు ఉండనున్నాయి. మునుగోడుకు 18 టేబుళ్లు, 18 రౌండ్లు, భువనగిరి 14 టేబుళ్లు, 19 రౌండ్లు, నకిరేకల్ 14 టేబుళ్లు, 23 రౌండ్లు, తుంగుతుర్తి 18 టేబుళ్లు, 19 రౌండ్లు, ఆలేరు 14 టేబుళ్లు, 23 రౌండ్లు, జనగాం 14 టేబుళ్లు, 20 రౌండ్లుగా విభజించారు. ఐదు వీవీప్యాట్లు తప్పనిసరిగా లెక్కించనున్నారు. ఈవీఎంలోని డేటా, వీవీప్యాట్లలోని సంఖ్యలను పోల్చి చూస్తారు. ఇవి కాకుండా ఇక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 14 టేబుళ్లు, సర్వీసు ఓటర్లకు 7 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. సర్వీసు ఓటర్లకు సంబంధించి స్కానింగ్ ద్వారా కౌంటింగ్ నమోదు చేస్తారు. ఇందుకోసం ఏడు టేబుళ్లను ఏర్పాటు చేస్తారు.

కౌంటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల ద్వారా చిత్రీకరించనున్నారు. లెక్కింపు కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ ఉండేలా జనరేటర్లు, ఇన్వర్టర్లు అందుబాటులో ఉంచనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులు మూడెంచల భద్రతను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో సీసీ కెమెరాల పర్యవేక్షణలో 24గంటలపాటు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంది. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, వాటర్ బాటిళ్లు, సిగరెట్లు, మద్యంలాంటి వాటిని అనుమతించరు. ఈసీ అనుమతి ఉన్న వారిని మాత్రమే కేంద్రాల్లోకి ప్రవేశం కల్పిస్తారు.

### లెక్కింపు ఇలా..

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | టేబుళ్లు | రౌండ్లు |
|---|---|---|---|
| ఇబ్రాహీంపట్నం | 343 | 20 | 18 |
| మునుగోడు | 317 | 18 | 18 |
| భువనగిరి | 257 | 14 | 19 |
| నకిరేకల్ | 311 | 14 | 23 |
| తుంగతుర్తి | 326 | 18 | 19 |
| ఆలేరు | 309 | 14 | 23 |
| జనగామ | 277 | 14 | 20 |

### కౌంటింగ్ వద్ద భారీ భద్రత

కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు కె. జెండగే, ఏఆర్వోల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఇద్దరు కౌంటింగ్ అబ్జర్వర్లు పర్యవేక్షించనున్నారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం..



భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ నెల 4న అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో కౌంటింగ్ జరుగుతుంది. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి రెండు సార్లు శిక్షణ ఇచ్చాం. ఇద్దరు అబ్జర్వర్లు రాబర్ట్ సింగ్ క్షేత్రమయిమ్, ఎండీ ఎజబా హుస్సేన్ కౌంటింగ్ ప్రక్రియలను పరిశీలిస్తారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి ప్రతి ఒక్కరికీ డ్యూటీ పాస్ ఇచ్చాం. పాస్‌లు ఉన్న వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

*– హనుమంతు కె. జెండగే, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్*

### కౌంటింగ్ వద్ద 144 సెక్షన్ అమలు



అరోరా కాలేజీలో కౌంటింగ్ కోసం మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశాం. స్ట్రాంగ్ రూమ్ వద్ద భారీ భద్రత ఉంది. పోలీసు బారి కేడింగ్ నుంచి వాహనాలను అనుమతించం. రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్స్, అంబులెన్స్, అగ్ని మాపక వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. పోలీసు హెల్ప్ లైన్ ఏర్పాటు చేశాం. కౌంటింగ్ కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సంబురాలు నిర్వహించొద్దు. కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సహకరించాలి.

*–రాజేశ్ చంద్ర, డీసీపీ*



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అధికారులు

## యాదగిరిగుట్టపైన ప్లాస్టిక్ నిషేధిద్దాం

యాదగిరిగుట్ట, జూన్ 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపైన దేవస్థానం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆలయ అధికారులు ప్లాస్టిక్ నిషేధిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ ప్లకార్డులు చేతబూని కొండ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. త్వరలో కొండపైన పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తామన్నారు. ఇప్పటికే దేవస్థాన అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ వినియోగాన్ని రద్దు చేశారని తెలిపారు. కొండపైన దుకాణదారులకు ఆదేశాలిచ్చామని తెలిపారు. జూన్ 15 నుంచి ప్లాస్టిక్ విక్రయించే వారికి జరిమాన విధించనున్నట్లు స్పష్టం చేశారు. భక్తులు కొండపైకి ప్లాస్టిక్‌ను తీసుకురావద్దని సూచించారు. ర్యాలీలో ఏఈఓలు రమేశ్‌బాబు, రఘు, రామ్మోహన్, శ్రవణ్‌కుమార్, ఈఈ ఊడెపు రామారావు, దయాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## సహకార సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల

నల్లగొండ, జూన్ 2 : జిల్లాలోని తొమ్మిది 9 సహకార సంఘాలు అనగా ఒక క్రెడిట్ సొసైటీ, ఒక మత్స్య సహకార సొసైటీ, ఆరు లేబర్ కాంట్రాక్టు సంఘాలు, ఒక ఇతర సహకార సంఘాలకు రాష్ట్ర కో ఆపరేటివ్ ఎన్నికల అథారిటీ ఎన్నికల నిర్వహించనున్నట్లు జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి రేపల్లె కిరణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ఈ నెల 6 నుంచి 28 లోపు నిర్వహించునున్నట్లు పేర్కొన్నారు. వివిధ సహకార సంఘాల ఎన్నికల ప్రతిపాదనలకు సంబంధించి విధి నిర్వహణలో ఉన్న సంఘ పాలకవర్గ సభ్యులు, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ లు, అడహక్ కమిటీ సంఘానికి ఎన్నికలు జరిపించాలని కమిటీ పదవి కాలం ముగియుటకు కనీసం 60 రోజుల ముందు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల కాలపరిమితి ముగిసిన ఇతర సహకార సంఘాలూ వారి సంబంధిత రిజిస్ట్రార్లు, సంఘాల ఎన్నికల ప్రతిపాదనలు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ హైదరాబాద్ వారికి సమర్పించాలని వివరించారు..

## గాలివాన బీభత్సం

- కూలిన స్తంభాలు.. ఎగిరిపడిన రేకులు
- లక్షల్లో ఆస్తి నష్టం



భువనగిరి మండలం వీరవెల్లిలో ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం



భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురంలో ఈదరుగాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

భువనగిరి కలెక్టరేట్, మే 2 : గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇండ్లు, పశువుల కొట్టాలపై రేకులు ఎగిరిపడ్డాయి. వీరవెల్లిలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, రేగు మల్లేశానికి చెందిన రూ.60వేల విలువైన పశువుల కొట్టం రేకులు కొట్టుకుపోయాయి. బీఎన్ తిమ్మాపురానికి చెందిన అంగడి సుధాకర్ ఫొటో స్టూడియోపై రేకులు ఎగిరి పడ్డాయి. రూ.3 లక్షల విలువైన కంప్యూటర్లు, ప్రింటర్, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

### కూలిన కోళ్ల ఫామ్..

రామన్నపేట/రాజాపేట : రామన్నపేట మండలంలోని సిరిపురం, వెల్లంకిలో చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బాచుప్పలలో జినుకుల శ్రీశైలానికి చెందిన 5 వేల కోళ్ల ఫాం నేలమట్టమైంది. పెద్ద సంఖ్యలో కోళ్లు మృతి చెందాయి. దుబ్బాకలో విద్యుదాఘాతంలో గుండాల సోమయ్యకు చెందిన గేదె మృతి చెందింది. రాజాపేట మండలం చల్లూరులో జంగిలి కొండల్‌కు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయాయి.



రామన్నపేట : బాచుప్పలలో గాలిదుమారానికి కూలిన కోళ్లఫామ్



రాజాపేట : చల్లూరులో ఎగిరిపడిన రేకులు

## నేటి నుంచి పెరిగిన టోల్ చార్జీలు అమలు

చౌటుప్పల్ రూరల్, జూన్2 : జాతీయ రహదారులపై పెరిగిన టోల్ చార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఉమ్మడి జిల్లాలోని చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా, కేతేపల్లి మండలంలోని కొర్లపహడ్ టోల్ ప్లాజా వద్ద పెరిగిన చార్జీలను వసూలు చేయనున్నారు. సింగిల్ జర్నీలో లైట్ మోటరు వాహనాలకు రూ.95, లైట్ కమర్షియల్ వాహనాలకు రూ.150, బస్ లేదా ట్రక్‌కు రూ.315, మల్టీయాక్సిల్ వాహనాలకు రూ.485, పెద్ద వాహనాలకు రూ.605 పెంచారు.



పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రాకపోకలు